

మెనూను అమలు చేయాలి

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి సూచించారు.

- 8లో ▸



ఎలుగుబంటి సంచారం

గండిమాసానిపేట శివారులో ఎలుగుబంటి సంచరిస్తోంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

- 8లో ▸

వాతావరణం


గరిష్టం/కనిష్టం 37.1 /23.7

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలు ఉన్నాయి. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది.

కరుణించని వరుణుడు

వర్షాకాలం సీజన్ ప్రారంభమై రెండు నెలలవుతోంది. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురిసిన దాఖలాలు లేవు. అప్పుడప్పుడు జల్లులు, ఓ మోస్తరు వర్షం కురవడం తప్ప పెద్ద వానల జాడలేదు. సాధారణ వర్షపాతం కూడా నమోదు కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి



పెద్దకొడప్‌గల్‌లో వర్షం లేక దెబ్బతింటున్న సోయా పంట

- జిల్లాలో 11 శాతం లోటు వర్షపాతం
- ఎనిమిది మండలాల్లో ఇబ్బందికర పరిస్థితి
- వెలవెలబోతున్న ప్రాజెక్టులు
- చెరువులు, కుంటల పరిస్థితీ అంతే...
- ఆందోళనలో రైతాంగం

రోహిణి కార్తెకు ముందు వర్షాకాలాన్ని తలపించేలా వానలు కురిపించిన వరుణుడు.. అసలు సీజన్‌లో ముఖం చాటేశాడు. అడపాదడపా జల్లులు, అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం మినహా.. జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురియలేదు. దీంతో జిల్లాలోని జలాశయాలు వెలవెలబోతున్నాయి. జిల్లాలో సాధారణ వర్షపాతం 442.6 మి.మీ.కాగా.. ఇప్పటివరకు 391.9 మి.మీ. వర్షపాతమే నమోదయ్యింది. అంటే సాధారణంకన్నా 11 శాతం తక్కువగా వర్షాలు కురిశాయి. ఎనిమిది మండలాల్లో పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. ఆయా మండలాల్లో సాధారణంకన్నా 20 శాతంకంటే తక్కువ వర్షపాతం నమోదయ్యింది. దీంతో ఆయా మండలాల్లో వానాకాలం పంటలు దెబ్బతింటున్నాయి. ముఖ్యంగా జుక్కల్ నియోజకవర్గంలోని మద్నూర్, జుక్కల్, పెద్దకొడప్‌గల్, బిచ్కుంద, పిట్లం, నిజాంసాగర్ మండలాలతోపాటు ఎల్లారెడ్డి, బీబీపేట మండలాల్లోనూ దుర్భిక్ష పరిస్థితులు నెలకొంటున్నాయి.

నిండని చెరువులు..

జిల్లాలో చెరువులు, కుంటలు 1,425 ఉన్నాయి. 675 చెరువుల్లో 25 శాతం మేర నీరు వచ్చినట్టు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. 25 శాతం నుంచి 50 శాతం దాకా వచ్చినవి 429 చెరువులు. 50 శాతం నుంచి 75 శాతం దాకా నిండినవి 159 కాగా.. 75 శాతం నుంచి 100 శాతం దాకా నిండినవి 123 చెరువులు ఉన్నాయి. పూర్తిగా నిండి అలుగులు పారినవి 39 చెరువులే.. కాగా గత ఏడాది ఇప్పటికే చెరువులు, కుంటలన్నీ అలుగులు పారాయి.

ఈసారి లోటు వర్షపాతం నమోదు కావడంతో పరిస్థితి దారుణంగా ఉంది. మెజారిటీ చెరువులు నీరు లేక వెలవెలబోతున్నాయి. వాగులు పొంగింది కూడా అంతంతమాత్రమే. దీంతో భూగర్భ జల మట్టం కూడా పెద్దగా వృద్ధి చెందలేదు.

ప్రాజెక్టులు వెలవెల..

జిల్లాలో ప్రాజెక్టుల పరిస్థితి కూడా చెరువుల్లాగే ఉంది. ఎగువన వర్షాలు లేకపోవడంతో మంజీర నది పారడం లేదు. దీంతో నిజాంసాగర్, పోచారం ప్రాజెక్టుల్లోకి నీరు రావడంలేదు. ఉన్న నీటిని తడుల కోసం వదులుతున్నారు. కౌలాస్ నాలా పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. వరుణుడు ఎప్పుడు కరుణిస్తాడో చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు ఎప్పుడు నిండుతాయోనని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

తడి'ఆరు'తోంది...

వర్షాలపైనే ఆధారపడి సాగు చేస్తున్న ఆరుతడి పంటలు సరైన వర్షాలు లేకపోవడంతో ఆరిపోతున్నాయి. జిల్లాలో ముఖ్యంగా జుక్కల్, మద్నూర్, పెద్దకొడప్‌గల్, బిచ్కుంద, పిట్లం మండలాల్లో ఎక్కువ విస్తీర్ణంలో సోయా, పత్తి, పప్పు దినుసుల పంటలు సాగు చేశారు. పది రోజులుగా సరైన వర్షాలు లేకపోవడంతో చాలా గ్రామాల్లో పంటలు దెబ్బతింటున్నాయి. గాంధారి, సదాశివనగర్, రామారెడ్డి, మాచారెడ్డి, పాల్వంచ, బీబీపేట, దోమకొండ, భిక్కనూరు, కామారెడ్డి, తాడ్వాయి, లింగంపేట, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట మండలాల్లోనూ వర్షాలపై ఆధారపడి మక్క, పత్తి, సోయా తదితర పంటలు వేశారు. ఆయా మండలాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

జిల్లాలో అత్యల్ప వర్షపాతం నమోదైన మండలాల వివరాలు..

మండలం	సాధారణం (మి.మీ.)	నమోదు (మి.మీ.)	వ్యత్యాసం (శాతం)
పెద్దకొడప్‌గల్	434.4	271.7	-37.5
పిట్లం	408.1	279.3	-31.5
నిజాంసాగర్	435.5	300.2	-30.7
ఎల్లారెడ్డి	499.2	348.9	-30.1
బిచ్కుంద	441.7	339.1	-23.2
మద్నూర్	422.7	330.4	-21.8
బీబీపేట	447.2	352.4	-21.2
జుక్కల్	420.1	333.2	-20.7

న్యూస్‌రీల్

ట్రాక్ కెమెరాలో చిరుత దృశ్యాలు



మాచారెడ్డి: అక్కాపూర్ అటవీ ప్రాంతంలో లేగదూడపై దాడి చేసి చంపిన చిరుతను గుర్తించేందుకు అటవీ అధికారులు మూడు చోట్ల ట్రాక్ కెమెరాలను ఏర్పాటు చేశారు. మంగళవారం రాత్రి ట్రాక్ కెమెరాలో చిరుత కదలికలు రికార్డయ్యాయని మాచారెడ్డి ఇన్‌చార్జి ఎఫ్‌ఆర్‌వో రమేశ్ తెలిపారు. చంపిన లేగదూడను తినేందుకు మళ్లీ వచ్చిందని పేర్కొన్నారు. పరిసర గ్రామాల ప్రజలు రాత్రి వేళల్లో అటవీ ప్రాంతంలో సంచరించవద్దని సూచించారు.

'317 జీవోను రద్దు చేయాలి'



బాన్సువాడ : ప్రభుత్వం 317 జీవోను రద్దు చేసి ఉపాధ్యాయులను వారి స్థానిక జిల్లాలకు కేటాయించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవీంద్రనాథ్ ఆర్య డిమాండ్ చేశారు. బుధవారం బాన్సువాడలో తపస్ సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యాసంస్థలలో నెలకొన్న సమస్యలను, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో తపస్ ప్రతినిధులు తారాచంద్, కృష్ణ, వేదప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

'ఉత్తమ ఫలితాలు సాధించాలి'



బాన్సువాడ : ఇంటర్‌లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని ఉమ్మడి జిల్లా స్పెషల్ ఆఫీసర్ దాసరి ఒడ్డెన్న సూచించారు. బుధవారం బాన్సువాడ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను ఆయన సందర్శించారు. ఉదయం ప్రార్థన సమయానికి వచ్చి విద్యార్థులతో పాటు ప్రార్థన చేశారు. గతేడాది ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. అధ్యాపకులతో సమావేశమై మాట్లాడారు. గతేడాదికంటే ఈసారి ఉత్తీర్ణత శాతం పెంచాలని సూచించారు. యూనిట్ టెస్టులపై అధ్యాపకులతో మాట్లాడారు. వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ అసద్ ఫారూఖ్, నోడల్ అధికారి సలాం, అధ్యాపకులు శివకుమార్, శ్రీనివాస్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ ధర్నాలో జిల్లా నేతలు



రాహుల్ ఫొటోను ప్రదర్శిస్తున్న ఇందుప్రియ

కామారెడ్డి టౌన్: బీసీ రిజర్వేషన్ల అమలు కోసం కాంగ్రెస్ పార్టీ బుధవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వేదికగా ధర్నా నిర్వహించింది. ఇందులో జిల్లాకు చెందిన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, ఎల్లారెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యేలు మదన్‌మోహన్‌రావు, తోట లక్ష్మీకాంతారావు, కామారెడ్డి మున్సిపల్ మాజీ చైర్మన్ ఇందుప్రియ పాల్గొన్నారు.

సదా మీసేవలో..

- వీపీవో వ్యవస్థ బలోపేతానికి చర్యలు
- పోలీసుల ఫోన్ నంబర్లతో వాల్‌రైటింగ్

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాలో పోలీసుల పనితీరు మెరుగుపరిచేలా ఎస్పీ రాజేశ్ చంద్ర పలు చర్యలు తీసుకుంటున్నారు. ప్రజలకు పోలీసుల సేవలు మరింతగా చేరువవ్వాలన్న ఉద్దేశంతో గ్రామ పోలీసు అధికారి (వీపీవో) వ్యవస్థను బలోపేతం చేస్తున్నారు. గ్రామ పోలీసు అధికారి ఆ గ్రామంలో అందరితో కాంటాక్ట్‌లో ఉండాలని, నెట్‌వర్క్‌ను బలోపేతం చేసుకోవాలని సూచిస్తున్నారు. ఇందులో భాగంగా గ్రామ పోలీసు అధికారులుగా పనిచేస్తున్న కానిస్టేబుళ్లు తమ ఫోన్ నంబర్లను ఆయా గ్రామాల్లో వివిధ వాట్సాప్ గ్రూపుల్లో యాడ్ చేయించుకున్నారు. వాట్సాప్ గ్రూపులలో చేసే పోస్టింగులు, జరిగే సంభాషణలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అధికారులకు సమాచారం చేరవేస్తున్నారు. వీపీవో వ్యవస్థను బలోపేతం చేయడంలో భాగంగా ఆయా గ్రామాల్లో ప్రధాన కూడళ్ల వద్ద అందరికీ తెలిసేలా 'సదా మీ సేవలో' అంటూ గ్రామ పోలీసు అధికారి ఫోన్ నంబరు, పేరు, ఎస్సై ఫోన్ నంబరు, పోలీస్ స్టేషన్ ఫోన్‌నంబర్లను రాయిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా వాల్‌రైటింగ్ చేపట్టారు. ఏ ఆపద ఉన్నా, ఏదైనా సమాచారం ఉన్నా పోలీసు అధికారులకు సమాచారం చేరేలా నంబర్లను ఊరూరా రాయిస్తున్నారు. తద్వారా గ్రామాల్లో జరిగే ఘర్షణలు, అసాంఘిక కార్యకలాపాలు, రాజకీయ గొడవలు.. ఇలా అన్ని విషయాలు ముందుగానే పోలీసులకు తెలిసేందుకు అవకాశాలు ఉంటాయని భావిస్తున్నారు.



గోడపై ఫోన్‌నంబర్లు రాయిస్తున్న దృశ్యం

కార్పొరేట్ శక్తులకు కేంద్రం వత్తాసు



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

- రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

కామారెడ్డి టౌన్: కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు వత్తాసు పలుకుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. బుధవారం కామారెడ్డి వీక్లీ మార్కెట్‌లోని మున్నూరుకాపు సంఘ భవనంలో సీపీఐ జిల్లా మూడో మహాసభలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు వత్తాసు పలుకుందని, ధనిక వర్గానికి మేలు చేస్తూ పేద, మధ్య తరగతి కుటుంబాలను విస్మరిస్తోందని విమర్శించారు. ధరల నియంత్రణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రశ్నించే గొంతులు, మావోయిస్టులు, అర్బన్ నక్సలైట్లు, దేశ పౌరులను చంపే హక్కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. ధనికులు అంబానీ, అదానీకి మేలు చేసే విధంగా పాలన సాగిస్తున్నాడని ఆరోపించారు. దేశంలోని 90 శాతం నిరుపేదలను విస్మరిస్తూ, 10 శాతం ధనిక వర్గం కార్పొరేట్ శక్తులకు ప్రధాని మోదీ పని చేస్తున్నాడని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహాసభల్లో భాగంగా పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నుంచి వీక్లీ మార్కెట్ వరకు ర్యాలీ తీశారు. మహాసభలలో సీపీఐ జాతీయ నాయకురాలు పశ్య పద్మ, రాష్ట్ర నాయకులు వీఎల్. నర్సింహారెడ్డి, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంజర భూమన్న, సీపీఐ జిల్లా కార్యదర్శి దశరథ్, ఉపాధ్యక్షులు బాలరాజ్, దుబాస్ రాములు, నాయకులు దేవయ్య, ఈశ్వర్, నాగమణి, మల్లేష్, రాజమణి, గంగాధర్, రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పోచారం నుంచి నీటి విడుదల



ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తున్న అధికారులు, నాయకులు

నాగిరెడ్డిపేట: పోచారం ప్రాజెక్టు నుంచి బుధవారం ప్రధాన కాలువలోకి నీటి విడుదలను ప్రారంభించారు. ఇరిగేషన్ ఇన్‌చార్జి ఎస్ఈ మల్లేశ్, ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డి, ఎల్లారెడ్డి ఏఎంసీ చైర్‌పర్సన్ రజితరెడ్డి కలిసి ప్రాజెక్టు గేట్లను పైకి ఎత్తి 150 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీటిని రైతులు పొదుపుగా వాడుకోవాలని వారు సూచించారు. నీరు చివరి ఆయకట్టుకు చేరేలా చూడాలని ఇరిగేషన్ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వర్లు, ఏఈ అక్షయ్‌కుమార్, వర్క్ఇన్‌స్పెక్టర్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వల్లే..

ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ప్రయత్నం వల్లే ప్రాజెక్టునుంచి ఆయకట్టుకు నీటిని విడుదల చేశారని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం ఆయన నాగిరెడ్డిపేటలో విలేకరులతో మాట్లాడారు. గతంలో జిల్లా అధికారుల నిర్ణయం మేరకు ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేసేవారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక నీటిపారుదలశాఖ రాష్ట్రస్థాయి అధికారుల అనుమతులతోనే ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అధికారులతో మాట్లాడి పోచారం ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయించారని పేర్కొన్నారు. సమావేశంలో మాల్తుమ్మెద సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ రాంచందర్‌రెడ్డి, నాయకులు కిష్టయ్య, కిరణ్‌కుమార్, శ్రీరాంగౌడ్, ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ'లో కామారెడ్డి ఫస్ట్

- అన్ని ప్రాంతాల్లో పిల్లర్లు తప్పనిసరి కాదు
- రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ సెక్రెటరీ, ఎండీ వీపీ గౌతమ్
- అనర్హులను ఎంపిక చేస్తే చర్యలు తప్పవని హెచ్చరిక



మాట్లాడుతున్న హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతమ్, వేదికపై కలెక్టర్ సంగ్వాన్, అదనపు కలెక్టర్లు

కామారెడ్డి క్రైం: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రగతిలో కామారెడ్డి జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉందని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ సెక్రెటరీ, ఎండీ వీపీ గౌతమ్ తెలిపారు. బుధవారం ఆయన జిల్లాలో పర్యటించారు. భిక్కనూరు, దోమకొండ మండలాల్లో పర్యటించి నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇందిరమ్మ ఇళ్ల ప్రగతిపై అధికారులతో సమీక్షించారు. లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేలా చూడడంతోపాటు సకాలంలో బిల్లులు చెల్లించడం, క్లస్టర్ వారీగా అధికారులను నియమించి సమీక్షలు నిర్వహించడం, క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ నిర్మాణాలను పర్యవేక్షిస్తుండడంతో కామారెడ్డి జిల్లా ఇందిరమ్మలో అగ్రస్థానంలో ఉందన్నారు. ఈ దిశగా కృషి చేసిన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను, అధికార యంత్రాంగాన్ని అభినందించారు. భిక్కనూరులో మాదిరిగా ఫిల్లర్ రూఫ్ పద్ధతిలో నిర్మించుకుంటే నిర్మాణ వ్యయం తగ్గడమే కాకుండా ఇల్లు వేసవిలో చల్లగా, చలికాలంలో వెచ్చగా ఉంటుందన్నారు. దీనిపై లబ్ధిదారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, మేస్త్రీలకు అవగాహన కల్పించాలన్నారు. ఇసుక సమస్య రాకుండా హౌసింగ్, రెవెన్యూ, మండల పరిషత్ అధికారులు సమన్వయం చేసుకొని ఉచితంగా ఇసుక టోకెన్లు అందించాలన్నారు. రవాణా చార్జీలకు ప్రభుత్వం నిర్ణయించిన ధర మాత్రమే చెల్లించేలా చూడాలన్నారు. మండల స్థాయి ధరల నియంత్రణ కమిటీల ద్వారా కంకర, ఐరన్, సిమెంటు, ఇటుకలు సరఫరా అయ్యేలా చూడాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మట్టి గట్టిగా ఉంటుందని, ఈ నేపథ్యంలో అన్ని ప్రాంతాల్లో పిల్లర్స్ తప్పనిసరి కాదని పేర్కొన్నారు. మట్టి గట్టిగా ఉన్న చోట్ల ప్లింత్ బీమ్‌తో నిర్మాణం చేపట్టవచ్చన్నారు. లబ్ధిదారులుగా అనర్హులను ఎంపిక చేసినట్లు గుర్తిస్తే పనులు ఏ స్థాయిలో ఉన్నా నిలిపివేసి సంబంధిత అధికారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్ల సమస్యను పరిష్కరించడానికి జిల్లా యంత్రాంగం కృషి చేయాలని సూచించారు.

11,883 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు..

జిల్లావ్యాప్తంగా 12,090 ఇళ్లు నిర్మించాలన్న లక్ష్యంతో పని చేస్తున్నట్లు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. వాటిలో ఇప్పటివరకు 11,883 ఇళ్లు మంజూరు చేశామని, ఇందులో 5,721 ఇళ్లకు ముగ్గు పోసి పనులు ప్రారంభించామని పేర్కొన్నారు. ఇప్పటివరకు 2,182 ఇండ్లు బేస్‌మెంట్ వరకు, 66 ఇండ్లు రూఫ్ స్థాయి వరకు చేరాయన్నారు. ఒక ఇంటి నిర్మాణం పూర్తయ్యిందన్నారు. 2,111 ఇళ్లకు నిర్మాణ దశను బట్టి బిల్లులు చెల్లించామన్నారు. 431 మందికి మహిళా సంఘాల ద్వారా బ్యాంకు లింకేజీ రుణాలను అందించామని వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు విక్టర్, చందర్ నాయక్, ఆర్డీవో వీణ, హౌసింగ్ పీడీ విజయ్‌పాల్‌రెడ్డి, డీఈ సుభాష్, ఏఈలు, మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్యాయత్నం

గాంధారి: అటవీ భూమిలో సాగు చేసిన పంటను ధ్వంసం చేయడానికి అధికారులు గడ్డిమందు పిచికారి చేయగా.. ఆ భూమిని సాగు చేసిన రైతు ఆవేదనతో ఆత్మహత్యకు యత్నించాడు. గ్రామస్తులు, ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సీతాయిపల్లి శివారులోని గండిమైసమ్మ కుంట అటవీ ప్రాంతంలో ఇరవై ఏళ్ల నుంచి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పంటలు పండిస్తున్నాడు. అతడికి అప్పులు ఉండడంతో ఆ భూమిని కుర్మ సంఘానికి అప్పగించి, ఊరు విడిచి వలసవెళ్లాడు. అదే సామాజికవర్గానికి చెందిన కోరె పెద్దమల్లయ్య, చిన్నమల్లయ్య ఆ భూమిని కౌలుకు తీసుకుని వరి వేశారు. బుధవారం అధికారులు ఆ పంటపై గడ్డిమందు పిచికారి చేయించారు. అనంతరం ఫిర్యాదు చేయడంకోసం అటవీ అధికారులు, రైతులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. ఈ క్రమంలో చిన్నమల్లయ్య వరిపై పిచికారి చేసిన గడ్డి మందును వెంట తీసుకుని వెళ్లి స్టేషన్‌లో తాగాడు. దీనిని గమనించిన గ్రామస్తులు వెంటనే మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి కామారెడ్డికి తరలించగా.. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచనతో నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. కాగా అటవీ భూమిని ఆక్రమించి పంటలు సాగుచేస్తున్నారని, వారించబోగా తమపై దాడికి ప్రయత్నించారని అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్ అరుణ.. కోరె మల్లయ్యతోపాటు మరికొందరిపై ఫిర్యాదు చేశారని ఎస్సై ఆంజనేయులు తెలిపారు. తమ పంటలను కావాలని నాశనం చేశారని అటవీ అధికారులపై సీతాయిపల్లి రైతులు ఫిర్యాదు చేశారన్నారు.



ఆత్మహత్యకు యత్నించిన కోరె చిన్న మల్లయ్యను అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

అల్బెండజోల్ మాత్రలను వేయించాలి

కామారెడ్డి టౌన్: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఈనెల 11న జిల్లాలో 19 ఏళ్లలోపు ఉన్న ప్రతి ఒక్కరికి అల్బెండజోల్ మాత్రలను వేయించాలని అదనపు కలెక్టర్ చందర్ నాయక్ సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని 19 ఏళ్లలోపు విద్యార్థులు అల్బెండజోల్ మాత్రలు వేసుకునేలా విద్య, మున్సిపల్ శాఖల అధికారులు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, డీసీహెచ్ఎస్ విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ చందర్‌నాయక్

సకాలంలో వైద్యం అందడం లేదు



తహసీల్దార్ దశరథ్‌కు వినతిపత్రం అందజేస్తూ..



పెద్దకొడప్‌గల్ పశువైద్యశాల ముందు ధర్నా చేస్తున్న పశువుల పెంపకందారులు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): పశువుల డాక్టర్ అందుబాటులో ఉండటం లేదని, పశువులకు సకాలంలో వైద్యం అందడంలేదని ఆరోపిస్తూ బుధవారం పశువుల దవాఖాన ముందు పశుపోషకులు నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ దశరథ్‌కు పశువైద్యులు అందుబాటులో ఉండడం లేదని వినతి పత్రం అందజేశారు.ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ..మండల కేంద్రంలోని వైద్యశాలకు ఎప్పుడూ తాళం వేసి ఉంటుందని పేర్కొన్నారు. ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలకు రోగాలు వచ్చి వైద్యం అందక చనిపోతున్నాయని వాపోయారు. ప్రైవేట్ వైద్యులను సంప్రదిస్తే రూ.వేలల్లో ఖర్చు అవుతున్నాయని అన్నారు. వైద్యులు అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు.

కాలం చెల్లిన మందులు..

ప్రభుత్వ పశువైద్యశాలలో కాలం చెల్లిన మందులు ఫ్రిడ్జ్‌లో నిల్వ ఉన్నాయి.. వైద్యుల నిర్లక్ష్యం వల్లే రూ.లక్షల విలువైన మందులు వృథా అవుతున్నాయని ఆరోపించారు. గతంలో కూడా కాలం చెల్లిన మందుల గురించి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు చేపట్టలేదని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని మండల పశుపోషకులు కోరుతున్నారు.

క్లుప్తంగా

మెనూ ప్రకారం భోజనం అందించాలి



బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను బుధవారం బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, ప్రతి రోజు సాయంత్రం స్నాక్స్ ఇవ్వాలని సూచించారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించడానికి ఉపాధ్యాయులు అందరు కృషి చేయాలని కోరారు. పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచాలని ప్రిన్సిపాల్ రాగిణిని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో కలిసి సబ్ కలెక్టర్ భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. తహసీల్దార్ వేణుగోపాల్, ప్రిన్సిపాల్ రాగిణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో రక్షాబంధన్



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేట్ పాఠశాలలో ఏబీవీపీ ఆధ్వర్యంలో రక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు రాఖీలు కట్టారు. సోదరీ, సోదరుల అనుబంధ గురించి వివరించారు. ఏబీవీపీ నాయకులు పవన్, దత్తారెడ్డి, అల్తాఫ్, సంజయ్, అంజి, విష్ణు, కృష్ణ, శ్రీకాంత్, కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణాత్మకత సదస్సు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో బుధవారం గ్రామీణ విశ్లేషణాత్మకత సదస్సును నిర్వహించారు. మహాజ్యోతిబాపూలే ప్రభుత్వ వ్యవసాయ కళాశాల, కరీంనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థులు పలు కార్యక్రమాలను చేపట్టారు. సోషల్ మ్యాప్, రిసోర్స్ మ్యాప్, టైంలైన్, ట్రాన్సాక్ట్‌వాక్, సీజనాలిటీ చార్టు వంటి పద్ధతుల ద్వారా గ్రామ వాస్తవిక పరిస్థితులను అధ్యయనం చేశారు. రైతుల జీవన శైలి, గ్రామవనరులపై సమాచారాన్ని సేకరించారు. విద్యార్థులు, వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



నస్రుల్లాబాద్: మండల కేంద్రంలో సీసీ రోడ్డు పనులను బుధవారం తహసీల్దార్ సువర్ణతో కలిసి ఏఎంసీ చైర్మన్ దుర్గం శ్యామల ప్రారంభించారు. నాణ్యత లోపం లేకుండా పనులు చేపట్టాలన్నారు. పనులకు రూ.12లక్షల ఎస్‌డీఎఫ్ నిధులను కేటాయించామన్నారు. నాయకులు పాల్త్య విఠల్, రాము, మాజీద్, కంది మల్లేష్, తదితరులు ఉన్నారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి

భిక్కనూరు: మండల కేంద్రంలో దోమల తీవ్రత ఎక్కువ ఉన్నందున నివారణ చర్యలు చేపట్టాలని కోరుతూ బుధవారం ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డికి ఆర్టీఐ ప్రతినిధి రవీందర్ వినతి పత్రం సమర్పించారు. ఆర్టీఐ ప్రతినిధులు కర్నాల శ్రీనివాస్, రాజశేఖర్ తదితరులున్నారు.

క్షేత్రస్థాయిలో పంటల పరిశీలన



గుజ్జుల్ తండా శివారులో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏవో రాజలింగం



దేవాయిపల్లిలో నానో యూరియాను డ్రోన్‌తో పిచికారీపై అవగాహన కల్పిస్తున్న ఏవో నర్సింలు

గాంధారి(ఎల్లారెడ్డి): పోతంగల్ కలాన్, గుజ్జుల్ తండా శివారులో బుధవారం క్షేత్రస్థాయిలో మొక్కజొన్న, వరి పంటలను పరిశీలించినట్లు ఏవో రాజలింగం తెలిపారు. మొక్కజొన్నలో మొగి పురుగు, రసం పీల్చే పురుగు ఆశించినట్లు గుర్తించామన్నారు. ఈ పురుగుల నివారణకు హెమామెక్టిన్ బెంజాయిట్ 18.5 ఎస్‌జీ ఎకరానికి 200 గ్రాములు, క్లోరాంత్రనిప్రోల్ 100 మి.లీ. ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. వరిలో టెట్రాసైక్లిన్, కాపర్ ఆక్సీక్లోరైడ్, స్ట్రెప్టోసైక్లిన్ 600 గ్రాములు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఎకరానికి 4 కి.గ్రా. పతేరా గుళికలు ఇసుకలో కలిపి చల్లాలని సూచించారు.

తాడ్వాయి మండలం దేవాయిపల్లిలో..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): దేవాయిపల్లి శివారులో పంటలను బుధవారం ఏవో నర్సింలు పరిశీలించారు. పంటల రక్షణలో రైతులు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. మొక్కజొన్న పంటలో అక్కడక్కడ కత్తెర పురుగు ఉధృతి అధికంగా ఉందని, దానికి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. యూరియా వాడకాన్ని తగ్గించి నానో యూరియా స్ప్రే చేయాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పైడి సంజీవరెడ్డి మొక్కజొన్న పంటలో నానో యూరియా, నానో పొటాష్‌ను డ్రోన్ ద్వారా పిచికారీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏఈవో రమ్య, రమేష్‌రెడ్డి, రైతులు ఉన్నారు.

మండల పంచాయతీ అధికారుల సంఘం నూతన కార్యవర్గం

దోమకొండ: జిల్లాలోని 25 మండలాల మండల పంచాయతీ అధికారుల సంఘం ఎన్నికలు డీఎల్‌పీవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించినట్లు దోమకొండ ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ తెలిపారు. సంఘం అధ్యక్షుడిగా ప్రవీణ్ కుమార్(దోమకొండ), ప్రధాన కార్యదర్శిగా ప్రకాష్(ఎల్లారెడి) కోశాధికారిగా తిరుపతిరెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యక్షులుగా సవిత, అబ్బాగౌడ్‌లను ఎన్నుకున్నామన్నారు. అదేవిధంగా జాయింట్ సెక్రెటరీలుగా నాగరాజ్, రాము, రఘురాం, కార్యవర్గ సభ్యులుగా సురేందర్‌రెడ్డి, ప్రభాకర్‌చారి, కృష్ణ, సూర్యకాంత్, లక్ష్మీనారాయణ, అనిత, వెంకట్ నర్సయ్య, సలహాదారులుగా సూర్యకాంత్, లక్ష్మీకాంత్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా మహబూబ్, మలహరి, తదితరులను ఎన్నుకున్నట్లు వివరించారు.

గండిమాసానిపేటలో ఎలుగుబంటి సంచారం



ఎలుగుబంటి సంచరించిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న అధికారులు



గండిమాసానిపేటలో ఎలుగుబంటి పాదముద్రలు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని గండిమాసానిపేట శివారులో ఎలుగుబంటి సంచరిస్తున్నట్లు ఎఫ్ఆర్‌వో చరణ్ తెలిపారు. గ్రామశివారులో ఎలుగుబంటి పాదముద్రలు ఉండడంతో అటువైపు ప్రాంతానికి వెళ్లే రైతులు, గ్రామస్తులు ఆందోళనకు గురవుతున్నారు. ఎలుగుబంటి సంచరించిందన్న సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు ఆప్రాంతాన్ని పరిశీలించారు. ఎలుగుబంటి సంచరించిన ప్రాంతంలో కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు ఎఫ్ఆర్‌వో చరణ్ తెలిపారు.

ప్రైవేటు ఆస్పత్రికి నోటీసు

బాన్సువాడ: బాన్సువాడ పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి జిల్లా వైద్యాధికారులు నోటీసులు ఇచ్చారు. వారం రోజుల క్రితం బిచ్కుంద మండలానికి చెందిన ఓ బాలుడికి జ్వరం రావడంతో ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సలహా మేరకు బాలుడిని నిజామాబాద్‌కు తీసుకెళ్లారు. అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు చెప్పడంతో బాన్సువాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యంతోనే బాలుడు మృతి చెందినట్లు బాలుడి కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో ఆందోళన చేపట్టారు. పోలీసులు జోక్యం చేసుకుని సముదాయించారు. జిల్లా వైద్య శాఖ ఆధ్వర్యంలో విచారణ చేపట్టి బాధ్యత రహితంగా వ్యవహరించినట్లు నిర్ధారించి ఆస్పత్రికి నోటీసు జారీ చేశారు. మూడు రోజుల్లో ఆస్పత్రిని మూసివేయాలని సూచించినట్లు తెలిసింది.

ప్రమాద స్థలం పరిశీలన



పెద్దకొడప్‌గల్‌లో జాతీయ రహదారి-161 బ్రిడ్జిపై ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల కేంద్రంలోని జాతీయ రహదారి-161పై వారం రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాద ఘటనా స్థలాన్ని, అలాగే 20 రోజుల కింద మండలంలోని పోచారం చౌరస్తాలో జరిగిన రోడ్డు ప్రమాద స్థలాన్ని బుధవారం తహసీల్దార్ దశరథ్‌తో కలిసి సీఐ రవీందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. ప్రమాదాలు జరుగకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏఎంవీఐ రజిని, ఎస్సై అరుణ్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మున్నూరు కాపు రాష్ట్ర రైతు విభాగం ఉపాధ్యక్షుడిగా భాస్కర్



నియామక పత్రాన్ని అందుకుంటున్న భాస్కర్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): కుప్రియాల్ గ్రామానికి చెందిన గడీల భాస్కర్‌ను మున్నూరు కాపు సంఘం రాష్ట్ర రైతు విభాగం ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా నియామక పత్రాన్ని బుధవారం అందజేశారు. భాస్కర్ మాట్లాడుతూ.. మున్నూరు కాపుల సంక్షేమం కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. పదవిని అప్పగించినందుకు రాష్ట్ర, జిల్లా కార్యవర్గానికి ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు.

లబ్ధిదారులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలి

- రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతం



గొట్టిముక్కులలో ఇందిరమ్మ ఇళ్లను కలెక్టర్‌తో కలిసి పరిశీలిస్తున్న హౌసింగ్ ఎండీ వీపీ గౌతం

దోమకొండ/భిక్కనూరు: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతం అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌తో కలిసి దోమకొండ మండలంలోని గొట్టిముక్కల గ్రామంలో, భిక్కనూరు మండలంలోని బస్వాపూర్, భిక్కనూరులలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఇసుక సరఫరా, బిల్లుల చెల్లింపు అంశాలపై లబ్ధిదారులతో ప్రత్యక్షంగా మాట్లాడారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉచితంగా ఇసుక సరఫరా అయ్యేలా చూడాలని, దశలవారీగా నిర్మాణం జరిగిన కొద్దీ బిల్లులు వెంటనే లబ్ధిదారులకు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. హౌసింగ్ ఇంజినీర్లు నాణ్యతగా ఇల్లు నిర్మాణం జరిగేలా చూడాలన్నారు. దోమకొండలో జిల్లా అదనపు కలెక్టర్లు విక్టర్, చందర్ నాయక్, హౌసింగ్ పీడీ విజయ్‌పాల్‌రెడ్డి, ఆర్డీవో వీణ, హౌసింగ్ డీఈ సుభాష్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, భిక్కనూరులో ఎంపీడీవో రాజ్‌కిరణ్ రెడ్డి, పంచాయతీ ఈవో మహేశ్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి దయాకర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

త్యాగశీలి ప్రొఫెసర్ జయశంకర్

కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



ప్రొఫెసర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: తెలంగాణ సమాజం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప త్యాగశీలి ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ అని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా బుధవారం కలెక్టరేట్‌లో అధికారికంగా నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రొఫెసర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అన్ని రంగాలలో వెనుకబడిన తెలంగాణ సమాజాన్ని చైతన్య పరచడానికి జయశంకర్ తన జీవితాన్ని అంకితం చేశారని అన్నారు. తన రచనలు, ప్రసంగాల ద్వారా సమాజాన్ని తట్టి లేపి తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమానికి ఊపిరి పోశారన్నారు. కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్‌గా వేలాది విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి మార్గదర్శకంగా నిలిచారని కొనియాడారు. అదనపు కలెక్టర్ విక్టర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, టీఎన్జీవో, టీజీవో ప్రతినిధులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తరలిన మధ్యాహ్న భోజన కార్మికులు



మద్నూర్ నుంచి ఆందోళనకు తరలుతున్న కార్మికులు



లింగంపేట: పోలీసుల అదుపులో కార్మికులు

మద్నూర్(జుక్కల్): తమ పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలంటూ మద్నూర్, డోంగ్లీ మండలాల మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులు హైదరాబాద్‌లోని విద్యాశాఖ కమిషనర్ కార్యాలయానికి తరలివెళ్లారు. ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నేత సురేష్ గొండ మాట్లాడుతూ.. భోజన నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు.

మధ్యాహ్న భోజన కార్మికుల అరెస్టు

లింగంపేట(ఎల్లారెడ్డి): పెండింగ్ బిల్లుల సాధన కోసం బుధవారం హైదరాబాదుకు వెళ్తున్న మధ్యాహ్న భోజన కార్మికులను లింగంపేటలో అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడారు. తమ న్యాయమైన కోర్కెల సాధన కోసం శాంతి యుతంగా నిరసన తెలపడానికి చలో హైదరాబాద్ కార్యక్రమం చేపడితే తమను అరెస్టు చేయడం శోచనీయమన్నారు. కిష్టయ్య, శ్రీరామ్, లక్ష్మీబాయి ఉన్నారు.

పోడు భూముల సమస్యలు పరిష్కరించాలి



భూములను పరిశీలిస్తున్న మాస్‌లైన్ నాయకులు

మాచారెడ్డి: అక్కాపూర్‌లో పోడు భూముల సమస్యను పరిష్కరించి హక్కు పత్రాలు ఇవ్వాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర సెక్రెటేరియట్ సభ్యుడు వి.ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం అక్కాపూర్‌లో అటవీ అధికారులు ధ్వంసం చేసిన రైతుల పంటలను పరిశీలించి మాట్లాడారు. యాభై ఏళ్లుగా రైతులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వకుండా వారేసిన పంటలను ధ్వంసం చేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల మేరకు పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ కామారెడ్డి జిల్లా కార్యదర్శి రామకృష్ణ, నాయకులు దేవరాం, రమేశ్, ప్రకాశ్, సురేశ్, కిషోర్, బాబన్న, దామోదర్, లింబన్న, తదితరులు ఉన్నారు.

గంజాయి తరలిస్తున్న నలుగురి అరెస్టు



కేసు వివరాలు తెలుపుతున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ స్వప్న

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలో గంజాయి తరలిస్తున్న నలుగురి నిందితులను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ స్వప్న తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. బుధవారం నగరంలోని అర్సపల్లి ప్రాంతంలో ఓ కారులో అక్రమంగా గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడిలో నలుగురు నిందితులు పట్టుబడగా వారు హైదరాబాద్‌కు చెందిన మహమ్మద్ మునావర్, మహమ్మద్ ఇర్ఫాన్, అమీర్ పాషా, నిజామాబాద్‌లోని ముజాయిత్‌నగర్‌కు చెందిన అన్వర్‌గా పోలీసులు గుర్తించారు. కారులో రెండు కిలోల వంద గ్రాముల ఎండు గంజాయి లభించిందని అన్నారు. నిందితులను అరెస్టు చేసి కారును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. దాడిలో ఎస్సైలు రామ్‌కుమార్, చారి, సిబ్బంది హమీద్, శివ, రాజన్న, భోజన్న, ఆశన్న, రాంబచన్, సాయిప్రసాద్ పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

బాన్సువాడ: బాన్సువాడ పట్టణంలోని సరస్వతి మందిరం సమీపంలో పేకాట స్థావరంపై దాడి చేసినట్లు సీఐ అశోక్ బుధవారం తెలిపారు. పక్కా సమాచారం మేరకు దాడి చేసినట్లు పేర్కొన్నారు. దాడిలో ఐదుగురికి అరెస్టు చేయగా రూ. 13,300 నగదు, 5 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

క్రైం కార్నర్

పాముకాటుతో యువకుడి మృతి



మృతుడు రాజు

బాన్సువాడ రూరల్: మండలంలోని తిర్మలాపూర్‌కు చెందిన వరగంతం రాజు (25) అనే యువకుడు పాము కాటుతో మృతి చెందినట్లు బాన్సువాడ సీఐ మండల అశోక్ తెలిపారు. దినసరి కూలి అయిన రాజు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంటివద్దే ఉంటున్నాడు. ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో పాముకాటు వేయడంతో గమనించిన కుటుంబీకులు వెంటనే చికిత్స నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి తల్లి భూమవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్ తెలిపారు.

అనారోగ్యంతో వృద్ధురాలి ఆత్మహత్య

రెంజల్: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వృద్ధురాలు ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రెంజల్ మండలం దూపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పాతరాజు చిన్న గంగామణి(57) అనే వృద్ధురాలు ఇంట్లో ఒక్కరే ఉంటున్నారు. ఆమె ఐదేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఆస్పత్రుల్లో చూయించినా నయం కావడం లేదు. దీంతో జీవితంపై విరక్తితో ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కుమార్తె దేవ గంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

బాన్సువాడ: బాన్సువాడ పట్టణంలోని షేక్ చాంద్ హోటల్ సమీపంలో గంజాయి విక్రయిస్తున్న రాజారాందుబ్బాకు చెందిన దాసరి పోశెట్టిని అరెస్ట్ చేసినట్లు సీఐ అశోక్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు దాడి చేసి నిందితుడిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. నిందితుడు నిజామాబాద్‌కు చెందిన ఆటో డ్రైవర్ బాబాఖాన్ వద్ద కొనుగోలు చేసి బాన్సువాడలో విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. పోశెట్టి నుంచి 275 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. పోశెట్టిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

రెంజల్: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. బోధన్ మండలం హంగర్గా శివారులోని వాగు నుంచి ఇసుకను ట్రాక్టర్‌లో తరలిస్తుండగా నీలా శివారులో పట్టుకున్నట్లు పేర్కొన్నారు. డ్రైవర్ వద్ద ఎలాంటి అనుమతులు లేకపోవడంతో పీఎస్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సిర్‌పూర్‌లో..

మద్నూర్: డోంగ్లి మండలంలోని సిర్‌పూర్ శివారులో ఉన్న మంజీర నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఆర్ఐ సాయిబాబా తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్ వద్ద ఎలాంటి అనుమతులు తరలిస్తున్నట్లు రుజువు కావడంతో రెవెన్యూ సిబ్బందితో కలిసి ఇసుక ట్రాక్టర్‌ను తహసీల్ కార్యాలయానికి తరలించామన్నారు. ఎవరైనా ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని ఆర్ఐ హెచ్చరించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో నంబర్ బస్ డిపో వెనక ప్రాంతంలో గురుతెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి బుధవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. డిపో పక్కన దుర్వాసన వస్తుండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతురాలి వయస్సు సుమారు 40 ఏళ్ల వరకు ఉంటుందని ఎస్‌హెచ్‌వో తెలిపారు. సుమారు ఆరు రోజుల క్రితం మరణించడంతో మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉందన్నారు. మృతి చెందిన మహిళ కామారెడ్డి ప్రాంతానికి చెందినట్లుగా గుర్తించినట్లు తెలిపారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించామని, మృతురాలి సంబంధీకులు ఎవరైనా ఉంటే ఒకటో టౌన్ పీఎస్‌లో సంప్రదించాలన్నారు.

డ్రంకన్ డ్రైవ్‌లో ఇద్దరికి రెండు రోజుల జైలు

కామారెడ్డి క్రైం: మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో కామారెడ్డి కోర్టు ఇద్దరు వ్యక్తులకు రెండు రోజుల జైలు శిక్ష విధించింది. వివరాలిలా ఉన్నాయి. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని బైద్యాపూర్‌కు చెందిన డేకల్ మోతె అనే వ్యక్తి డెకరేషన్ పనులు చేస్తూ, యూపీకి చెందిన రవీంద్ర చౌహాన్ పెయింటర్‌గా పని చేస్తూ కొంతకాలంగా కామారెడ్డిలో ఉంటున్నారు. రెండు రోజుల క్రితం చేపట్టిన వాహనాల తనిఖీల్లో వీరిని పట్టణ పోలీసులు డ్రంకన్ డ్రై వ్‌లో పట్టుకున్నారు. బుధవారం కోర్టుకు హాజరుపర్చగా ద్వితీయశ్రేణి న్యాయమూర్తి చంద్రశేఖర్ వీరికి రెండు రోజుల జైలు శిక్ష, రూ.200 ల చొప్పున జరిమానా విధించినట్లు ఎస్పీ రాజేశ్ చంద్ర తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా ప్రతి రోజూ డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేపడుతున్నామని అన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు.

ఖలీల్‌వాడి: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్షను సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ విధించినట్లు ట్రాఫిక్ సీఐ ప్రసాద్ తెలిపారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో 18 మంది పట్టుబడగా వీరిని పీఎస్‌కు తరలించి కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. జడ్జి 16మందికి రూ. 25,500 జరిమానా విధించగా ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు సీఐ పేర్కొన్నారు.

మోపాల్: మండల కేంద్రంలో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో సిర్‌పూర్ గ్రామానికి చెందిన బొడ్డు గంగాధర్‌కు ప్రత్యేక ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి నూర్జహాన్ బేగం నాలుగు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై సుస్మిత తెలిపారు. వాహనదారులు మద్యం సేవించి నడిపితే జైలు శిక్ష తప్పదని ఎస్సై పేర్కొన్నారు.

డయల్-100 దుర్వినియోగంలో ఇద్దరికి..

ధర్పల్లి: మండలంలోని డీబీ తండాకు చెందిన రూప్ల నాయక్, గణేశ్ మద్యం సేవించి ఈనెల 4న డయల్-100కు పలుమార్లు ఫోన్ చేసి పోలీసుల విధులను దుర్వినియోగ పరిచారు. దీంతో పోలీసులు ఇద్దరిపై కేసు నమోదు చేసి బుధవారం నిజామాబాద్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా వీరికి జడ్జి నాలుగు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై కళ్యాణి పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడే డయల్-100ను ఎవరైనా దుర్వినియోగానికి పాల్పడితే చర్యలు తప్పవని ఎస్సై తెలిపారు.